

విశాలాంధ్ర విశాఖపట్నం

గురువారం 3, ఏప్రిల్, 2025

పేజి నెం. 5

రాష్ట్ర హోం మంత్రి

వంగలపూడి అనితకు ఆహ్వానం

విశాలాంధ్ర-సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరహ లక్ష్మీనృసింహ స్వామి వారి వార్షిక తిరు కల్యాణం మహోత్సవానికిఈ నెల 8న జరిగే వార్షిక తిరు కల్యాణోత్సవం, 30న జరిగే అప్పన్న స్వామి నిజరూప దర్శనం చందనోత్సవాలకు హాజరు కావాలని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితని ఇంచార్జ్ ఈఓ కొమ్ముల సుబ్బారావు ఆహ్వానించారు. బుధవారం విజయవాడలోని హోంమంత్రి క్యాంపు కార్యాలయంలో కలిసి ఆమెకు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా అప్పన్నస్వామి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రాలను ఆలయ ఈవో హెూంమంత్రికి అందజేశారు.

ఇళ్ల నిర్మాణాల్లో మరింత పురోగతి సాధించాలి

కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్ : గుత్తేదార్లు, అధికారులు సమష్టి కృషి చేసి ప్రధాన మంత్రి ఆవాస్ యోజన-ఎన్టీఆర్ కాలనీల గృహ నిర్మాణ పథకంలో భాగంగా చేపట్టిన ఇళ్ల నిర్మాణాల్లో మరింత పురోగతి సాధించాలని, రోజుకు 100 నుంచి 150 నిర్మాణాలు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ మీటింగు హాలులో ఇళ్ల నిర్మాణాల పురోగతి, ఇసుక సరఫరా, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. లేఅవుట్ల వారీగా సమీక్షించిన కలెక్టర్ అక్కడ చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. క్షేత్ర స్థాయిలో గుత్తేదార్లతో శతశాతం పని చేయించాలని, నిర్దేశిత లక్ష్యాలకు మేరకు స్టేజ్ కన్వెర్షన్ జరగాలని, నిర్మాణాలు పూర్తి చేయాలని చెప్పారు. మండల ప్రత్యేక అధికారులు, లేఅవుట్ ఇన్ ఛార్జి అధికారులు పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని క్షేత్ర స్థాయి అధికారులకు తగిన సహకారం అందించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను సమన్వయంతో పరిష్కరించుకొని ముందుకెళ్లాలని, మరింత పురోగతి సాధించాలని పేర్కొన్నారు. హౌసింగ్ పీడీ, ఎస్.డి.సి. సత్తిబాబు, ఈఈ, డీఈలు, ప్రత్యేక అధికారులు, ఏఈలు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న 4 టన్నుల పిడిఎస్ బియ్యం పట్టివేత

భీమిలి క్రాస్‌రోడ్ వద్ద చాకచక్యంగా పట్టుకున్న పోలీసులు

మార్కెట్ విలువ సుమారుగా 2 లక్షలు పై మాటే...

విశాలాంధ్ర-ఆనందపురం : మండలంలో జాతీయ రహదారిపై గుట్టుచప్పుడు కాకుండా అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వాహ నాన్ని బుధవారం తెల్లవారుజామున భీమిలి క్రాస్ రోడ్డు చెక్ పోస్ట్ వద్ద ఆనందపురం పోలీసులు పిడిఎస్ రైస్ ను పట్టుకున్నారు. ఆనందపురం సిఐ చింత వాసు నాయుడు, సివిల్ సప్లై డిటి శ్రీనివాసరావు స్థానిక పోలీస్ స్టేషన్లో మధ్యాహ్నం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. అందించిన వివరాలు ప్రకారం రేషన్ బియ్యం తరలిస్తున్నారన్న అందిన సమాచారం మేరకు బుధవారం విశాఖపట్నం నుండి ఆనందపురం వైపు వస్తున్న బొలోరో వ్యాన్ ఏపీ 39 యు టి 4180, వాహనంలో తనిఖీలు నిర్వహించగా 4 టన్నుల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించామని వీటి విలువ సుమారుగా 2 లక్షలు పైనే ఉంటుందని ఈ బియ్యాన్ని కేజీ 10 రూపాయలకు కొని ఆనందపురం పరిసర ప్రాంతాల్లో విక్రయించనున్ననట్లు వ్యాన్ డ్రైవర్ తెలిపారు. ఈ మేరకు సివిల్ సప్లై డిటి శ్రీనివాసరావు సమక్షంలో రేషన్ బియ్యాన్ని సీజ్ చేసి సివిల్ సప్లై అధికారులకు అందజేసినట్లు సిఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ వాసు నాయుడు తెలిపారు.

సిపిఐ విశాఖ జిల్లా 25వ మహాసభ జయప్రదం చెయ్యండి

విశాలాంధ్ర-మధురవాడ: మే 10, 11 తేదీలలో విశాఖలో నిర్వహించే సిపిఐ విశాఖ జిల్లా మహాసభను జయప్రదంచెయ్యాలని పార్టీ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు విజ్ఞప్తి చేశారు. బుధవారం మధురవాడ సిపిఐ కార్యాలయం పిఎస్ఆర్ భవనంలో జరిగిన ఏరియా సమితి సమావేశంలో పాల్గొని పైడిరాజు మాట్లాడుతూ మూడవసారి ప్రధాని మోదీ అధికారం చేపట్టిన తరువాత రాజ్యాంగం స్ఫూర్తికి వ్యతిరేకంగా పాలన సాగిస్తున్నదని మతపరమైన అంశాలు ఉపయోగించి పాలన సాగిస్తూ ముస్లింలు, క్రైస్తవులను టార్గెట్ చేస్తూ దాడులకు పాల్పడుతున్నారని అన్నారు. ప్రభుత్వ పాలనలో మతం ఉపయోగించడం నేరమని రాజ్యాంగంలో స్పష్టంగా ఉన్నప్పటికీ వక్ఫ్ బోర్డుకు నూతన చట్టం తీసుకొని వచ్చి కలతలు సృష్టించి భయభ్రాంతులకు గురిచేయ్యటం సిపిఐ తీవ్రంగా వ్యతిరేకస్తున్నదని తెలిపారు. నాగపూర్ లో ముస్లిం లపై దాడులు చేసిన వారిని వదిలిపెట్టి దాడులకు గురైన ముస్లింల పైన తిరిగి కేసులు పెట్టడం దుర్మార్గమన్నారు. ప్రపంచంలోనే అధిక జనాభా కలిగిన మన భారతదేశంలో నిరుద్యోగం, ఆకలి చావులు కూడా అధికంగా ఉన్నాయన్నారు. రైతులకు నష్టం చేసి కార్పొరేట్లకు ఉపయోగపడే మూడు నల్ల చట్టాలు రద్దు చెయ్యాలని నాలుగు సంవత్సరాలనుండి ఆందోళన చేస్తున్న రైతులకు చర్చలు పేరుతో వారిని పిలిచి అక్రమంగా అరెస్టులు చేసి వారి నిరసన శిభిరాలను ధ్వంసం చెయ్యడం అన్యాయం అన్నారు. ఇటువంటి అనేక ప్రజా, రైతు, కార్మికుల వ్యతిరేకంగా పాలన చేస్తున్న కేంద్రం ప్రభుత్వం వ్యతిరేక విధానాలపై ప్రచారం చేస్తామని తెలిపారు. మన రాష్టంలో కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చినట్లు ఇళ్ళు లేని నిరుపేదలకు పట్టణాలలో రెండు సెంట్లు స్థలం ఇచ్చి ఇళ్ళు నిర్మాణానికి 5 లక్షలు ఉచితంగా మంజూరు చెయ్యాలని, టిడ్కో ఇళ్ళకు అన్ని వసతులు కల్పించి ఎంపిక చేసిన లబ్ధిదారులకు అందజేయ్యాలని డిమాండ్ చేశారు. పార్టీ సీనియర్ నాయకుడు కొల్లి మేఘారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఏరియా కార్యదర్శి వాండ్రాసి సత్యనారాయణ, బి కేశవయ్య, ఎం ఎస్ పాత్రుడు, కె అరుణ్ కుమార్, జి వేలంగినిరావు, అబ్దుల్ అక్బర్, నూలు త్రినాథ్, డి సతీష్, కె చిన్న, వి సూరిబాబు, ఎన్ అప్పారావు, ఎం బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.

లాజిస్టిక్ రంగంలో అపార అవకాశాలు

గీతంలో నిపుణుల వెల్లడి

విశాలాంధ్ర-మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ బిజినెస్ ఆధ్వర్యంలో లాజిస్టిక్స్ మరియు ఆపరేషన్ ఆపరేషన్ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సును బుధవారం నిర్వహించారు ఈ కార్యక్రమానికి గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజా ఫణి పప్పు అధ్యక్షత వహించారు. ప్రముఖ సంస్థ అవాన్ ఇంటలెక్ట్ అధ్యక్షుడు డేవిడ్ సింగ్ , ఛీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (ఇండియా) బబ్లు తివారి మరియు ప్రొఫెసర్ కార్తికేయన్ హాజరై విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా నిపుణులు మాట్లాడుతూ లాజిస్టిక్స్ మరియు ఆపరేషన్ రంగంలో ఉద్యోగ అవకాశాలు విస్తృతంగా ఉన్నాయని అయితే విద్యార్థులు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంచుకో వాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులు అందిపుచ్చుకోవాలని అలాగే పారిశ్రామిక అవసరాలకు తగిన విధంగా కాలానుగుణంగా నైపుణ్యాలను విస్తృత పరుచుకోవాలని సూచించారు. గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజా ఫణి పప్పు తన ప్రసంగంలో పరిశ్రమలకు విద్యాసంస్థలకు మధ్య బలమైన సంబంధాల ద్వారా దేశానికి అవసరమైన మానవ వనరులను నైపుణ్యాలతో సిద్ధం చేయవచ్చునని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు నిపుణులు సమాధానం ఇచ్చారు కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ అసోసియేట్ ప్రొఫెసర్ ఎన్ సాయి సుధాకర్, ఆపరేషన్ మరియు సప్లై భాగం చైర్మన్ డాక్టర్ వైఎల్పి తోరణి తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ్ డిగ్రీ కాలేజీ జాబ్ మేళాలో 12 మందికి ఉద్యోగాలు

విశాలాంధ్ర-పెందుర్తి: స్థానిక ఆదర్శ్ డిగ్రీ కాలేజీలో బుధవారం నిర్వహించిన జాబ్ మేళాలో 12 మంది ఉద్యోగాలకు ఎంపిక అయ్యారని ప్రిన్సిపాల్ ఎన్.ఈ ఫ్లోరా తెలియజేశారు. ఈ జాబ్‌మేళాలో హనీ గ్రూప్ కంపెనీ హెచ్ఆర్ మేనేజర్ కే.రామకృష్ణ, జనరల్ మేనేజర్, సేల్స్ అండ్ రిక్రూట్మెంట్ టి.హెచ్.ఎన్.వి.ప్రసాద్ పాల్గొని 32 మంది నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహించి వారిలో 12 మందిని ఎంపిక చేసి తమ సంస్థలో ఉద్యోగాలు ఇప్పించారని ప్రిన్సిపాల్ తెలిపారు. నూతనంగా ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు ఆదర్శ్ డిగ్రీ కాలేజ్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్, టి.థియోఫిలస్ అభినందనలు తెలియజేశారు. ఈ జాబ్‌మేళాలో ఆదర్శ్ డిగ్రీ కాలేజ్ ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ జి. కమలారాణి, వైస్ ప్రిన్సిపాల్ ఎ.శ్రీనివాస్ రావు, ఎం.వి.నాగమణి, డి.టి. రమ్య, పీ.వీ.శాంతి పాల్గొన్నారు.

పాలీసెట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత శిక్షణా తరగతులు

విశాలాంధ్ర-భీమిలి: భీమునిపట్నం పాలిటెక్నిక్ కళాశాలలలో ప్రవేశానికి నిర్వహించే పాలీసెట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు 03.4.2025 వ తేదీ నుండి 28.04.2025వ తేదీ వరకు భీమునిపట్నం ప్రభుత్వ మహిళా కళాశాలలో ఉచిత శిక్షణా తరగతులు నిర్వహించబడును. మరియు పరీక్ష రాయుటకు కావలసిన కోర్స్ మెటీరియల్ ఉచితంగా ఇవ్వబడును. ఈ అవకాశాన్ని భీమునిపట్నం పరిసర ప్రాంతములలో గల పదవ తరగతి పాస్ అయిన లేదా పదవ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు అందరు సద్వినియోగం చేసుకోవాలని తెలియచేస్తున్నాము. శిక్షణ సమయము ఉదయం 9.30 నుండి 12.30 వరకు. శిక్షణకు హాజరయ్యే విద్యార్థులు 03.4.2025వ తేదిన కళాశాలకు రావలెను. పాలిటెక్నిక్ ఎంట్రన్స్ పరీక్షకు అప్లై చేసిన లేదా చెయ్యగోరు విద్యార్థులు మాత్రమే శిక్షణకు అర్హు లని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ మురళీకృష్ణ తెలిపారు.

ఇది అంబేద్కర్ ఆలోచనల విజయం

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్: ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడం నిజంగా గొప్ప విషయం అని,ఇది అంబేద్కర్ ఆలోచనల విజయమని అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ (ఏఎంసీ) అధ్యక్షులు బొద్దు కళ్యాణ్ రావు, ప్రధాన కార్యదర్శి జె వి ప్రభాకర్ తెలిపారు. బుధవారం జరిగిన సమావేశంలో వీరు మాట్లాడుతూ కొంతమంది ఎన్నికలు ఆపడానికి చాలా ప్రయత్నం చేశారని ,వాటిని అధికమించి, ప్రజాస్వామ్యం విజయం సాధించిందన్నారు. ఇది అంబేద్కర్ ఆలోచనల విజయమని, గెలుపు ఓటమిని సమానంగా స్వీకరించ లేకపోతే మనం అంబేద్కర్ వారసులుగా చెప్పు కోలేమన్నారు. గెలిచిన ప్యానెల్ సభ్యులు భవిష్యత్ లో ఏమి చెయ్యాలి అనుకుంటున్నారు అనేది మేనిఫెస్టోలో ముందుగా తెలియ చేసామన్నారు. కేంద్రంలో వున్న ప్రభుత్వం దళిత వ్యతిరేకం అని మనకు తెలుసు. దాన్ని ఎలా ఎదుర్కోవాలి? ఎవరితో కలిసి పనిచెయ్యాలి, అనే సమస్యపై మీరు నిర్మాణాత్మక మైన సలహాలు ఇవ్వాలని కోరారు. అంబేద్కర్ భవనాన్ని అంబేద్కర్ ఆలోచనల కేంద్రంగా, ప్రత్యామ్నాయ సాంస్కృతిక కేంద్రంగా, నైపుణ్య శిక్షణ అభివృద్ధి కేంద్రంగా తయారుచేస్తామన్నారు. అంబేద్కర్ వాదులు ఉన్నతంగా ప్రవర్తిస్తారు అని సభ్యసమాజానికి రుజువు చేయాలన్నారు. నిబద్ధతకు, నిజాయితీకి, మంచి కోసం, మార్పు కోసం ఓటు వేసి గెలిపించిన వారికి మరొక్కసారి ధన్యవాదములు, బుద్ధ వందనాలు తెలిపారు.

రధసారధికి ఆహ్వానం



విశాలాంధ్ర-సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్యదైవం శ్రీ వరహాలక్ష్మీ నృసింహ స్వామి వారి రథోత్సవానికి రథసారధి కదిరి లక్ష్మణరావు కు ఏఈఓఎన్ ఆనంద్‌కుమార్, గుమస్తా కొండబాబు ఆహ్వానం పలికారు. ఈ నెల 8న సింహాద్రినాధుని వార్షిక తిరు కల్యాణం సందర్భంగా తొలుత రథోత్సం నిర్వహించటం అనవాయితీ. అమ్మవారు బెస్త కుటుంబానికి చెందినదిగా పురాణాలు చెబుతున్నాయి. అందుకు గడిచిన అరవై ఏళ్లుగా బెస్త కుటుంబానికి చెందిన కదిరి లక్ష్మణరావు రథానికి సారధిగా ఉంటున్నారు. ఆయనతో పాటు సింహగిరీశుని రథాన్ని అన్నివైపుల భద్రత కోసం పోలీస్ వారితో పాటు, బెస్త కుటుంబ యువకులు వస్తారు.

వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే పంచకర్ల



విశాలాంధ్ర-పెందుర్తి: కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామిని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు బుధవారం ఉదయం సతీసమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించినట్లు ఎమ్మెల్యే కార్యాలయం ఓ ప్రకటనలో తెలియజేసింది. ఆలయ అర్చకులు, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, అధికారులు పంచకర్ల దంపతులకు స్వాగతం పలికి, దర్శనం కల్పించి స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేసినట్లు ప్రకటనలో వెల్లడించారు.

సింహాద్రి నాధునికి 4 కేజీలు ముత్యాలతలంబ్రాలు విరాళం

విశాలాంధ్ర-సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరహ లక్ష్మీనృసింహ స్వామి వారి వార్షిక తిరు కళ్యాణ మహోత్సవంకు హైదరాబాద్‌కు చెందిన విజయలక్ష్మీ డైమండ్స్ నగల వ్యాపారి శివశంకర్ రాజు తమ కుటుంబ సభ్యులతో కలిసి 4 కేజీల 100 గ్రాములు మంచి ముత్యాలు స్వామివారికి విరాళంగా అందజేశారు. ఆలయ పర్యవేక్షణాధికారి జి.వి.వి.ఎస్. కె ప్రసాద్ కు అందజేశారు. దాతలకు సింహాద్రి నాధుని ప్రత్యేక దర్శనం, వేద ఆశీర్వచనం చేయించి శేష వస్త్రంతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అదేవిదంగా ఆర్జిత సేవల్లో భాగంగా నిత్య కళ్యాణం, గరుడ సేవ వైభవంగా జరిగాయి.

చిన్న శ్రీను కుటుంబాన్ని పరామర్శించిన అదీప్ రాజ్

విశాలాంధ్ర-పెందుర్తి : విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్, భీమిలి నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త మజ్జి శ్రీనివాస రావు(చిన్న శ్రీను) కుటుంబాన్ని పెందుర్తి మాజీ ఎమ్మెల్యే వైసీపీ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పరామర్శించారు. బుధవారం చిన్న శ్రీను ద్వితీయ కుమారుడు స్వర్గీయ మజ్జి ప్రణీత్ బాబు పెద్దకర్మ కార్యక్రమానికి వెళ్లి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

ప్రకృతి విపత్తుల అప్రమత్తతకు మాక్‌డ్రిల్

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్: ప్రకృతి విపత్తులు, అనుకోని ప్రమాద ఘటనలను ఎలా ఎదుర్కోవాలి అనే అంశంపై అవగాహన కల్పిస్తూ... అప్రమత్తం చేస్తూ జిల్లా ప్రకృతి విపత్తుల నిర్వహణ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం మహారాణిపేట పరిధిలోని స్థానిక జబర్ తోట వద్ద మాక్ డ్రిల్ నిర్వహించారు. సునామీ, తుఫాన్లు, భూకంపాలు, అగ్ని ప్రమాదాలు వంటి ప్రకృతి విపత్తుల సమయంలో ఎలా వ్యవహరించాలో, ఎలా జాగ్రత్తపడాలో డీపీఎం కళావతి సమక్షంలో ఎన్డీఆర్ఎఫ్, ఎస్టీఆర్ఎఫ్ సిబ్బంది అవగాహన ప్రజలకు కల్పించారు. ఎన్.డి.ఆర్.ఎఫ్., ఎస్టీఆర్ఎఫ్, అగ్నిమా పక, పోలీసు, జీవీఎంసీ, రెవెన్యూ, వైద్యారోగ్య, ఆర్&బి, పరిశ్రమ లు, సివిల్ సప్లైస్, పశుసంవర్ధక, ఈపీడీసీఎల్, గ్రామీణ నీటి సరఫరా, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, పబ్లిక్ హెల్త్ తదితర శాఖల అధికారులు, సిబ్బంది కార్యక్రమంలో భాగస్వామ్యమయ్యారు.

కూటమి ప్రభుత్వం హామీలను అమలు చేయాలి : సీపీఐ

విశాలాంధ్ర- మల్కాపురం: సిపిఐ శ్రీహరి పురం శాఖ మహాసభలు బుధవారం జి రమణమ్మ అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో సిపిఐ విశాఖ జిల్లా కార్యవర్గ సభ్యులు కాండ్రేగుల సత్యాంజనేయ, గుడాల రాంబాబు, శ్రీహరిపురం శాఖ కార్యదర్శి గండి అప్పారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ప్రజల సమస్యలను పరిష్కరించలేదని ఆరోపించారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుపేదలకు టిడ్కో ఇళ్లు ఇస్తానని ఎన్నికలు ముందు ఇచ్చిన వాగ్దానాలు ఇచ్చి గెలిచాక మరిచిపోయారని అన్నారు. కూటమి ప్రభుత్వం నిత్యవసర వస్తువుల ధరలు తగ్గించాలని, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గుడాల రాంబాబు మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలనే ప్రైవేటు సంస్థలకే అప్పజెప్పుతున్నారని విశాఖ స్టీల్‌ప్లాంట్ ని ప్రైవేటుపరం కాకుండా చేస్తానని ప్యాకేజీలతో సరిపెడుతున్నారు తప్ప ప్రభుత్వ రంగంలోనే కొనసాగుతోందని చెప్పటం లేదు. కూటమి ప్రభుత్వాలు ఎలక్షన్ ముందు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని, లేనియెడల పార్టీ టిడ్కో ఇళ్ల బాధితులను ఏకం చేసి ఆందోళన చేయటానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరిం చారు. అదేవిధంగా ఏప్రిల్ 11 జీవీఎంసీ మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నిర్వహించి పోయే బహిరంగ సభకు పారిశ్రామిక ప్రార్థన తరుపున నుండి పార్టీ అభిమానులు ప్రజలు తరలిరావాలని కోరారు. సభకు జాతీయ కార్యదర్శి కే నారాయణ పాల్గొంటారని, సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి శ్రీహరిపురం శాఖ సభ్యులు జి.అప్పల రెడ్డి, చంద్రశేఖర్ ప్రకాష్, బి.సత్యవతి, శ్రీలక్ష్మి, వై లక్ష్మి , కే పార్వతీ తదితరులు పాల్గొన్నారు

జీవీఎంసీ లో జరుగుతున్న ప్రక్రియ మీద అవగాహన ఉందా.?

మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ కు జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్ ప్రశ్న



విశాలాంధ్ర-విశాఖ సిటీ: జివిఎంసిలో జరుగుతున్న ప్రక్రియ గురించి అవగాహన ఉందా అని మాజీ మంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షులు గుడివాడ అమర్నాథ్ ను జనసేన కార్పొరేటర్ ప్రశ్నించారు. కూటమి కార్పొరేటర్లు మేయర్ పై అవిశ్వాస తీర్మానం చేశారని, అది ఎన్నికల ప్రక్రియ కాదని మాజీ మంత్రికి తెలియకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. అమర్నాథ్ ఆంధ్ర యూనివర్సిటీ పొలిటికల్ లేదా లా డిపార్ట్ మేంట్ ప్రొఫసర్ దగ్గర ట్యూషన్ చేప్పించుకుంటే మంచిదని సలహా ఇచ్చారు. కూటమి కార్పొరేటర్లు ఇచ్చిన మేయర్ పై అవిశ్వాస తీర్మానం మీద జిల్లా కలెక్టర్ గా, జివిఎంసి ఇంచార్జి కమీషనర్ గా హరింద్ర ప్రసాద్ జివిఎంసి లో కన్వీనర్ గా సమావేశం ఏర్పాటు చేస్తున్నారు గానీ ఎన్నిక నిర్వహించడం లేదన్నారు. వైసిపి కార్పొరేటెర్లకు రక్షణ కావాలన్నారు.. వాళ్ళు ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. మీరు క్యాంప్ రాజకీయం మొదలుపెట్టి, సెక్యూరిటీ ఇవ్వాలి అంటే బెంగుళూర్ లోటస్ పాండ్ లో ఉన్న కార్పొరేటర్లకు ప్రభుత్వం సెక్యూరిటీ ఇవ్వాలా అని ప్రశ్నించారు. మీ క్యాంప్ లో ఉన్న వారికి రక్షణ లేదు అంటే మీ నుంచే ప్రాణహాని ఉందని అనుమానం కలుగుతోందన్నారు. బాబాయిని లేపేసిన ఘనత, తల్లిని పార్టీ నుంచి తోసేసిన వారు, చెల్లి పై కేసు పెట్టిన ట్రాక్ రికార్డ్ ఉన్న వారు ఉన్నారు కనుక పోలీసులకు మేమే ఫిర్యాదు చేస్తామన్నారు. కూటమి పార్టీ మీద ఎలా పడితే అలా బురదజల్లే ప్రయత్నం ఇప్పటికైనా మానుకోవాలన్నారు. ఎంపి ఎంవివి కొట్టేసిన ఆస్తులు కోసం మాట్లాడు అమర్. విశాఖ లో పది వేల కోట్ల భూములు ఒక్కో నేత మింగారు వైసిపి ప్రభుత్వంలో నువ్వు లూలు కోసం మాట్లాడటం ఆశ్చర్యంగా ఉందన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగం ఉందని చెప్తున్న అమర్ కి రాజారెడ్డి రాజ్యాంగం కావాలా అని ఎద్దేవా చేశారు.

రూ.3.62 కోట్ల పనులకు గంటా శంకుస్థాపన

విశాలాంధ్ర-భీమిలి: జీవీఎంసీ పరిధిలోని 3, 4 వార్డుల్లో రూ. 3.62 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు బుధవారం శంకుస్థాపన చేశారు. రూ. 1.91 కోట్ల వ్యయంతో దొరతోట నుంచి కె.జి.బి.వి. స్కూల్ వరకు నిర్మించనున్న బీటీ రోడ్డుకు శ్రీకారం చుట్టారు. అలాగే బాలాజీ హేచరీ నుంచి కె.నగరంపాలెం వరదేశమ్మ ఆలయం వరకు రూ.18.35 లక్షలతో రోడ్డు నిర్మించనున్నారు. కె.నగరంపాలెం పాత పంచాయతీ ఆఫీస్, పెద్ద ఉప్పాడ గ్రామం, టాస్ పార్క్ కాలనీ తదితర ప్రాంతాల్లో రూ. కోటితో రోడ్లు, డ్రెయిన్లు ప్రతిపాదించారు. గొల్లల తిమ్మాపురం లో రూ.49 లక్షలతో కళ్యాణమండపం నిర్మించనున్నామని ఎమ్మెల్యే వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమం లో వి.ఎం. ఆర్.డి.ఎ. ఛైర్మన్ ఎం.వి. ప్రణవ్ గోపాల్, జోనల్ కమిషనర్ ప్రేమ ప్రసన్న వాణి, కార్పొరేటర్లు గాడు చిన్ని కుమారి లక్ష్మి, గంటా అప్పలకొండ, కూటమి నాయకులు కె.రామానాయుడు, గంటా నూకరాజు, పాసి త్రినాథ్, గరికిన కింగ్, నరసింగరావు పాల్గొన్నారు.

కళ్యాణ మండపాలను పరిశీలించిన గంటా

భీమిలి కె.జి.బి.వి. స్కూల్ సమీపంలోని కొండ పైన నిర్మాణంలో ఆగిపోయిన కళ్యాణ మండపాలను ఎమ్మెల్యే గంటా పరిశీలించారు. గెయిల్ సంస్థ అందించిన రూ.3 కోట్ల సి.ఎస్.ఆర్. నిధులతో రెండు మండపాల నిర్మాణానికి ప్రతిపాదించారు. అయితే ఈ పనులు మధ్యలో ఆగిపోవడంతో మండపాలను సందర్శించారు.

ఈతపేటలో సెల్ టవర్ ని వ్యతిరేకిస్తున్న స్థానిక ప్రజలు

విశాలాంధ్ర-పద్మనాభం: బాలాజీ నగర్ లో ఈతపేట లో షెల్ టవర్ ని వ్యతిరేకిస్తున్న స్థానిక ప్రజలు, మద్దతు తెలియజేసిన సిపిఎం పార్టీ టిడిపి పార్టీ, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో షెల్‌టవర్‌ని నిర్మిస్తే! చుట్టుపక్కల ఉన్నవారు అనారోగ్యాలకి గురవుతారని! ముఖ్యంగా రేడియేషన్ ప్రాబ్లం వల్ల వృద్ధులకి మహిళలకి చిన్నపిల్లలకి తీవ్రమైన అనారోగ్య నష్టం జరుగుతుందని, టవర్ పర్మిషన్ వెంటనే రద్దు చేసుకోవాలని! లేకపోతే ప్రజలతో తీవ్ర వ్యతిరేకత వచ్చే అవకాశం ఉందని! ప్రజలకు మేలు చేసే పనులు చేయాల తప్ప! కీడు చేసే పనులు ఎవరూ చేయొద్దని! ఈ నిరసన కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు ఆర్ఎస్ఎన్ మూర్తి ఎస్ అప్పలనాయుడు పంపాను సూర్యనారాయణ రీసు చిన్నారావు, టిడిపి పార్టీ నుంచి తమ్మిన సూరిబాబు, గీత కార్మిక సంఘం నుంచి రీస్ రమణ, గీత కార్మికులు స్థానిక ప్రజా నాయకులు శివ కుమార్, స్థానిక మహిళలు,వృద్ధులు పిల్లలు పాల్గొన్నారు.

ఆధునిక వసతులతో రామవరం, గంగసాని అగ్రహారం లే అవుట్ల అభివృద్ధి

- ఆనందపురం అభివృద్ధికి కృషి
- ఐటీకై తర్లువాడలో 200 ఎకరాలు
- భీమిలి ఎమ్మెల్యే గంటా

విశాలాంధ్ర-ఆనందపురం,విశాఖ ఎంవీపీ కాలనీ లే అవుట్, మిథిలాపురి వుడా కాలనీ లే అవుట్లకు మాదిరిగా రామవరం, గంగసాని అగ్రహారం లే అవుట్లను అన్ని ఆధునిక వసతులతో కూడిన అగ్రశేణి లే అవుట్ గా తీర్చిదిద్దుతామని భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు అన్నారు. వి.ఎం.ఆర్.డి.ఎ. అభివృద్ధి చేయనున్న గంగసాని అగ్రహారం లే అవుట్ పనులకు బుధవారం శాసనసభ్యులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 9 ఏళ్ల నుంచి పెండింగ్ లో ఉన్న రైతుల సమస్యకు రెండురోజుల్లో పరిష్కారం చూపించామని తెలిపారు. 2016 లో వి.ఎం.ఆర్.డి.ఎ. సేకరించిన 245 ఎకరాల్లో మొదటి విడతగా రైతుల కోసం 85 ఎకరాల్లో అన్ని హంగులతో లే అవుట్ తయారవుతుందన్నారు. ఎన్నికల ప్రచారానికి రామవరం వచ్చినప్పుడు వి.ఎం.ఆర్.డి.ఎ. తీసుకున్న భూముల సమస్య, జాతీయ రహదారి నుంచి 80 అడుగుల రోడ్డు కావాలని అడిగారని, ఇక్కడి ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తూ ఈ రెండు హామీలను తీర్చడం ఆనందంగా ఉందని తెలిపారు.

తర్లువాడలో 15 వేల మంది యువతకు ఉద్యోగ భరోసా..

10 వేల నుంచి 15 వేల మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే ఐటీ పరిశ్రమను తర్లువాడ సమీపంలోని 200 ఎకరాల్లో అభివృద్ధి చేయనున్నట్టు గంటా చెప్పారు. ఇప్పటికే భూ సేకరణ పనులు ప్రారంభమ య్యాయని, హైదరాబాద్ లోని మాదాపూర్, గచ్చిబౌలి మాదిరిగా విశాఖలో ఆనందపురం ప్రాంతం శరవేగంతో అభివృద్ధి చెందుతుందన్నారు. గత ఎన్నికల్లో 93 వేల మెజారిటీ ఇచ్చిన భీమిలి ప్రజల రుణాన్ని అభివృద్ధి చేసి తీర్చుకుంటానన్నారు. 8 వేల జీతానికి ఈ ప్రాంత మహిళలు 25 నుంచి 30 కిలోమీటర్ల దూరంలోని పారిశ్రామిక ప్రాంతానికి వెళ్తున్నారని, పరిశ్రమలు ఇక్కడ అందుబాటులోకి వస్తే ఈ ప్రాంత మహిళలకు మెరుగైన ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. వి.ఎం.ఆర్.డి.ఎ. కమిషనర్ విశ్వనాథన్ మాట్లాడుతూ భూములిచ్చిన రైతులకు నెల రోజుల్లో ఎల్.పి.ఓ.సి.లు ఇస్తామని, ఆ తర్వాత 20 రోజులకు ప్లాట్లు రిజిస్ట్రేషన్లు పూర్తిచేస్తామన్నారు. కార్యక్రమంలో వి.ఎం.ఆర్.డి.ఎ. చైర్మన్ ప్రణవ్ గోపాల్, మాజీ ఎమ్మెల్యే కర్రి సీతారామ్, బీజేపీ భీమిలి ఇంచార్జ్ రామానాయుడు, రామవరం సర్పంచ్ ఎర్ర రాజు, కాకర్లపూడి శ్రీకాంత్ రాజు,, ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పి4 సేవలలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు అమలుచేయాలి

పీసీసీ ప్రధాన కార్యదర్శి మూల వెంకటరావు

విశాలాంధ్ర-పెందుర్తి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పి4 సేవలలో బిసిలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయ్యాలని ఓబిసి డిపార్ట్మెంట్ ఇన్చార్జ్ పిసిసి ప్రధాన కార్యదర్శి మూల వెంకట్రావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన పి4 కార్యక్రమంలోని ముఖ్యాంశాలు కేంద్ర ప్రభుత్వం లక్ష్యాలలోనివేనని, దేశంలో టాప్ 500 కంపెనీలు కోటి మంది పేదలకు ఉపాధి చూపాలని ప్రధానమంత్రి మోది ఆయో కంపెనీ యాజమాన్యాలకు నిర్దేశించడంతో ఆ కార్యక్రమం కేంద్ర స్థాయిలో ఇప్పటికే కొనసాగుతుందని వెల్లడించారు. కాని దాతృత్వంతో సమాజం మారదని, పేదరికం తగ్గాలంటే పేదల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచాల్సి ఉందని పేర్కొన్నారు. మానవుడు ఆనందంగా ఉండటానికి కేవలం సంపద సృష్టిస్తే సరిపోదు, పేదల భద్రతకు చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా అంతర్గత స్వేచ్ఛ, భావస్వేచ్ఛ, బాగస్వామ్య స్వేచ్ఛ, అనవసర నిబందనలస్వేచ్ఛ, రక్షిత స్వేచ్ఛ వంటివి సమకూర్చాలని పేర్కొన్నారు. ఇటీవల గ్రామాల్లో చేపట్టిన నైపుణ్య సర్వేలో గుర్తించిన అంశాలను పరిగణనలోకి తీసుకుని ఆయా రంగాలలో వారిని ప్రోత్సహించాలని కోరారు. ముఖ్యంగా గ్రామాలలో కులవృత్తులను ప్రోత్సహించడం ద్వారా ఆయా సామాజిక వర్గాల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచవచ్చునని తెలిపారు. గ్రామాల్లో ఆదాయ వనరుల పెంపుదలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. అయితే వాస్తవంగా పేదలంటే లెక్క లేనితనం రాష్ట్రంలో అడుగడుగునా కన్పిస్తోందని, నేటికీ రెవెన్యు కార్యాలయాలలోకి చాలామంది పేదలు అడుగుపెట్టలేని పరిస్థితులు ఉన్నాయన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులు కార్యాలయాలలో పేదలు ఎదుర్కొంటున్న అవమానాలు లెక్కలేనన్ని ఉన్నాయని, ముందుగా వాటిని పారదోలాలని డిమాండ్ చేశారు. పి4 సర్వేలో అందరి సలహాలు సూచనలు తీసుకోవాలనుకుంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయం స్వాగతించదగ్గ పరిణామం అని, అయితే అదే ఆలోచనతో బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. గతంలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిగా మాయావతి పి3 విధానాన్ని అమలు చేసి బీసీలకు అణగారిన వర్గాలకు రిజర్వేషన్ అమలు చేసి ఆయా వర్గాలకు ఎంతో మేలు చేశారని అదే స్ఫూర్తితో రాష్ట్రంలో పి 4 విధానాన్ని అమలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లకు రాష్ట్రంలోని బీసీల తరవున విజ్ఞప్తి చేస్తున్నట్లు మూల వెంకటరావు ప్రకటించారు.

పక్కా అనుమతులతోనే అపార్ట్మెంట్ నిర్మాణం...

ఎవరికి ఎటువంటి అనుమానం ఉన్న పత్రాలు పరీక్షించుకోవచ్చు

అంబటి హైట్స్ డెవలపర్స్ అంబటి శంకర్రావు, బలబద్రుని చెన్నయ్య శెట్టి

విశాలాంధ్ర-భీమిలి : భీమునిపట్నం కుమ్మరిపాలెం వలంద భూములు సర్వే నంబర్ 13 లో ఉన్నటువంటి భూమిలో శ్రీ సాయి లక్ష్మీ డెవలపర్స్ వారు అంబటి హైట్స్ పేరుతో అపార్ట్మెంట్ ను నిర్మిస్తున్నామని. ఈ నేపథ్యంలో కొంతమంది స్థానికులు వ్యక్తిగత కారణాలతో నిర్మాణాన్ని సాఫీగా జరుగకుండా ఆపడానికి అధికారులకు లేనిపోని పిటిషన్లు పెడుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని సంస్థ ప్రతినిధులు. అంబటి శంకర్రావు బలబద్రుని చెన్నయ్య శెట్టి తెలిపారు. స్థానికి చిన్న బజార్ లో జరిగిన పత్రికా విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అపార్ట్మెంట్ నిర్మాణానికి జి వి ఎం సి మరియు రెరాల వద్ద అన్ని అనుమతులు తీసుకుని తాము ఈ నిర్మాణాన్ని చేపట్టామని వారు తెలిపారు. ఇది వరలో ఒకసారి ఇవి గ్రామ కంఠం భూములు అని స్థానికులు ఫిర్యాదు చేయగా అప్పటి తహసీల్దార్ నుంచి ఇందులో ఎటువంటి ప్రభుత్వ భూమి లేదని, పత్రాలు అన్నీ సరిగానే ఉన్నాయని ఎండార్స్మెంట్ తీసుకోవడం కూడా జరిగింది. తదుపరి నిర్మాణం జరుగుతుండగా మరొకసారి పి జి ఆర్ ఎస్ లో జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేయడంతో కొన్ని పత్రికల్లో వార్త రావడం జరిగింది. దాని నిమిత్తం స్థానిక తహసీల్దార్ ఇచ్చిన నోటీసుల మేరకు వారిని కలిసి తమ యొక్క పత్రాలను మరియు అనుమతులను చూపించడం జరిగిందని వారు విలేఖరులకు తెలియజేశారు. ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి తాము చేస్తున్న ఈ అపార్ట్మెంట్ పై మాటిమాటికీ ఎటువంటి ఆధారాలు లేకుండా చేస్తున్న ఈ ఫిర్యాదుల వలన తమకు మానసిక అశాంతి కలుగుతోందని వారు వాపోయారు. అందుకే పత్రికా ముఖంగా తమ వాదనను తెలియజేస్తున్నామని చెప్పారు. ఎవరికి ఎటువంటి అనుమానం ఉన్నా ఎప్పుడైనా తమ పత్రాలను వచ్చి పరీక్షించుకోవచ్చని వారు అన్నారు. తమ నిర్మాణానికి ఆటంకం కలిగిస్తున్న వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ శాఖల నుంచి అన్ని రకాల అనుమతులు పొందిన తమ నిర్మాణానికి ఇబ్బందులు రాకుండా చూడాలని స్థానిక అధికారులకు విజ్ఞప్తి చేశారు.

మల్లె తోటలపై ఎర్రనల్లి ప్రభావం...

- రోజు రోజుకి పెరిగిపోతున్న కీటక నాశనం
- బయటికి పువ్వులను పారవేస్తున్న వైనం...
- రైతులు గుండెల్లో పిడుగు ...
- గిట్టుబాటు ధర లేక పెట్టుబడి కూడా రానివైనం
- ఉచితంగా మందులు అందించాలని ప్రభుత్వానికి రైతుల విజ్ఞప్తి



విశాలాంధ్ర-ఆనందపురం : పువ్వులను నాశనం చేస్తున్న కొత్తరకం వేరియంట్ రైతులు గుండెల్లో గుబులు పెట్టుబడి కూడా రాని వైనం పురుగుల మందులకే డబ్బులు దారపోస్తున్నామని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మారుతున్న కాలానికి ప్రజలు జీవన స్థితిగతులకు అనుకూలంగా ప్రతి మనిషి కాయ కష్టం చేసుకుని బ్రతుకుతున్న పరిస్థితులు అందులో రైతుల పరిస్థితి రోజురోజుకీ చాలా దిగజారి పోతుందని చెప్పవచ్చు. వ్యవసాయానికి పెట్టుబడి అందించి తద్వారా వచ్చే ఆదాయంతో కుటుంబ జీవన ప్రమాణానికి ఉపయోగించుకొని కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈ సీజన్లో మార్చి, ఏప్రిల్, మే , నెలల్లో పలు శుభకార్యాలు వలన పువ్వుల ధరలకు మంచి గిరాకీ ఏర్పడుతుంది. వేసవికాలం వచ్చిందంటే పువ్వులతో రైతులు బిజీ బిజీగా వ్యవసాయాన్ని సాగు చేస్తుంటారు. ఏప్రిల్ నుండి నవంబర్, అక్టోబర్ వరకు సుమారుగా పువ్వులు సీజన్గా చెప్పుకో వచ్చు, అందులో ముఖ్యమైనవి మల్లె, విరజాజులు, కనకాంబరాలు, బంతి, మందారం మొదలగు పువ్వులను మార్కెట్లో విక్రయాలు రైతులు చేస్తుంటారు. గత ఏడాదిలాగే ఈ సంవత్సరం కూడా పువ్వులు రైతులకు రాబడి అంతంత మాత్రమే. ఎందుకనగా మల్లె పువ్వులకు కొత్తరకం వేరియంట్ ఎర్ర నల్లి పురుగు రూపంలో పంటను సర్వ నాశనం చేస్తుంది. పువ్వు లోపల పురుగు వేల సంఖ్యలో తమ సంతానాన్ని తీవ్రంగా ఉత్పత్తి చేస్తుంది. అందువల్ల పువ్వులపై తన ప్రతాపాన్ని చూపిస్తూ తద్వారా మల్లె రైతులు తీవ్ర అందోళనకు గురిచేస్తుంది. అనేక రకాల మందులు తెచ్చి పిచికారి చేసినప్పటికీ కూడా ఆ భయంకర కీటక నాసిని అయితే తగ్గడం లేదని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం అందిస్తున్న పురుగుల మందుల దుకాణాల్లో తెచ్చిన మందులు సరిగ్గా పనిచేయడం లేదని వేల రూపాయలు వెచ్చించి మందులు కొన్నప్పటికీ అవి పంటకు పిచికారి చేసినా కూడా ఎటువంటి ప్రయోజనం లేకుండా పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంటలు సాగు చేసి పెట్టుబడి పెట్టిన సమయానికి తీరా పురుగు రూపంలో వంటను నామరూపాలు లేకుండా నాశనం చేస్తుంది. అనేక రకాల పురుగులు మందులు తెచ్చి జల్లినా కూడా పువ్వుల తోటల్లో ఎటువంటి మార్పు లేదు. రోజురోజుకీ పువ్వుల దిగుబడి తగ్గిపోవడంతో పాటు పువ్వులు ద్వారా వచ్చే రాబడి పురుగుల మందులకే రావడం లేదని రైతన్నలు లబో దిబోమంటున్నారు. గత ప్రభుత్వం రైతులను అయితే పట్టించుకోని దాఖలాలు లేవని అయితే ఈ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రైతులకు వ్యవసాయనికి కావలసిన నాణ్యమైన పురుగులు మందులను తక్కువ ధరకు సబ్సిడీ రూపంలో అందించినట్లయితే కొంతమేర ఉపశమనం కలుగుతుందని వాపోతున్నారు. అసలు ఈ వైరస్ ఎలా నాశనం అవుతుందో తెలియడం లేదని రెండు సంవత్సరాల నుండి ఈ ఎర్ర నల్లి పురుగు పూల తోటలపై జూలు ప్రదర్శిస్తుందని వ్యవసాయ అధికారులు చెప్పిన మందులు తోటలకు పిచికారి చేసినప్పటికీ అస్సలు ప్రయోజనం లేకుండా పోతుందని వెంటనే సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు పంటలను క్షుణ్ణంగా పరిశీలించి కావలసిన పురుగుల మందులను సరఫరా చేయాలని రైతన్నలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

బైలపూడి సూర్యనారాయణ మాస్టారుకు ఘన నివాళులర్పించిన ప్రముఖులు

విశాలాంధ్ర-పెందుర్తి : మండలంలోని పినగాడి గ్రామానికి చెందిన బైలపూడి సూర్యనారాయణ మాస్టారుకు పలువురు రాజకీయ, రాజకీయేతర ప్రముఖులు బుధవారం ఘన నివాళులర్పించారు. జిల్లాలో అనేక పాఠశాలలో ఎందరో విద్యార్థులకు విద్యనేర్పించి ఉన్నత స్థానంలో నిలిపిన సూర్యనా రాయణ మాస్టారు(82) మార్చి 23న స్వర్గస్తులు కాగా, ఆయన కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు బుధవారం నిర్యాణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్, మాజీ ఎమ్మెల్యేలు చింతలపూడి రామయ్య, అన్నంరెడ్డి అదిప్రాజ్, కరణం ధర్మశ్రీ,, విశాఖ పార్లమెంటు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గండి బాబ్జి, టిడిపి నాయకులు గండి వంశీ, గండి దేముడు బాబు, బిజెపి పెందుర్తి నియోజకవర్గం కన్వీనర్ గొర్లె రామనాయుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కోడిగుడ్ల దేవి సాంబ, వైసిపి నాయకులు గండి రవికుమార్ సహా పార్టీలకతీతంగా పలువురు రాజకీయ నాయకులు, అధికార ప్రముఖులు, ఆయన దగ్గర విద్యనభ్యసించిన విద్యార్థులు సూర్యనారాయణ మాస్టారు నిర్యాణ కార్యక్రమంలో పాల్గొని ఘన నివాళులర్పించారు. అలాగే ఆయన సమాజానికి అందించిన సేవలను ప్రస్తుతించారు.

టిడిపి వీరాభిమాని పైడిపల్లి ఎల్లయ్యమ్మ

టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు

విశాలాంధ్ర-భీమిలి: తెలుగుదేశం పార్టీకి రెండు దశబ్దాలుగా విశిష్ట సేవలు అందించి పార్టీ అభివృద్ధికి ఎనలేని కృషి చేయడంలో భీమిలి జోన్ 3వ డివిజన్ తెలుగు మహిళా అధ్యక్షురాలు పైడిపల్లి ఎల్లయ్యమ్మ సేవలు మరువలేనివని 3వ డివిజన్ అధ్యక్షులు, రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. బుధవారం పైడిపల్లి ఎల్లయ్యమ్మ అకాలమరణం చెందారని తెలుసుకున్న గంటా నూకరాజు పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసివెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఒక తెలుగింటి ఆడపడుచుని కోల్పోయిందని బావోద్వేగానికి గురయ్యారు. పార్టీ కార్యక్రమం అంటే చాలు ఎప్పుడూ ముందుండేవారని అన్నారు. ఏ పని అప్పజెప్పినా తుచ తప్పకుండా పాటించేవారని అన్నారు. మహిళలతో మమేకమై పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేవారని అన్నారు. రెండు దశబ్దాల రాజకీయ ప్రయాణంలో 15 సంవత్సరాలు సుదీర్ఘంగా మహిళా అధ్యక్షురాలుగా పనిచేశారని అన్నారు. 3వ వార్డులో మహిళల అవసరాలు ముందుగా గుర్తించి స్థానిక నాయకత్వం దృష్టికి తీసుకొనివెళ్లి పరిష్కరించడంలో ముందుండే వారని అన్నారు. పైడిపల్లి ఎల్లయ్యమ్మ గారు భౌతికంగా మనమధ్య లేకపోయినా వారు చేసే సేవలు రూపంలో అనుక్షణం మనమధ్యే ఉంటారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు దేవుడు మనోధైర్యం ఇవ్వాలని మనస్ఫూర్తిగా దేవుని ప్రార్థిస్తున్నామని గంటా నూకరాజు అన్నారు.

ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవం మరియు జాతీయ నడక దినోత్సవం

విశాలాంధ్ర-పద్మనాభం: ఏప్రిల్ నెలలో మొదటి బుధవారం జాతీయ నడక దినోత్సవం గా పాటిస్తారని స్థానిక ఒకటవ వార్డు ఉపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు విద్యార్థులకు తెలియజేశారు. రోజూ కొంతసేపు నడవండి - ఆరోగ్యంగా జీవించండి. నడక ఆరోగ్యానికి వెన్నెముక వంటిదని విద్యార్థులకు ఆరోగ్య చిట్కాలు తెలియజేశారు. నడక పోటీ నిర్వహించి బహుమతులు అందజేశారు. వయస్సు కు తగ్గట్లు పిల్లల్లో రావలసిన మానసికపరమైన ఎదుగుదల రాకుండా ఉండే పరిస్థితినే "ఆటిజం" అంటారని, ఇది పిల్లల్లో బాల్యంలోనే ప్రారంభమయ్యే అరుదైన సమస్యని ప్రతి వంద మందిలో ఒకరు లేక ఇద్దరు చిన్నారుల్లో ఈ సమస్య కనిపిస్తుందని, 2023 నాటికి ప్రపంచవ్యాప్తంగా సుమారు 70 కోట్ల మందిలో ఈ లక్షణాలు ఉన్నట్లు విద్యార్థులకు తెలియజేశారు. ఏప్రిల్ 2న ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవం గా పాటిస్తారని తెలిపారు. ఏదో తెలియని పరధ్యానం, కారణం లేకుండానే బిగ్గరగా ఏడవడం, తమను తామే గాయపరచుకోవడం, ఉలుకూ పలుకూ లేకుండా ఉండిపోవడం ఈ వ్యాధి లక్షణమని తెలియజేశారు. పిల్లలు ఆరోగ్యంగా ఎదగటానికి పౌష్టికాహారం ముఖ్యమని, శిశువు పుట్టిన తొలి ఆరు నెలలు తల్లిపాలు చాలా ముఖ్యమని, చిన్నారులకు ఇచ్చే రోజువారి ఆహారంలో కార్బోహైడ్రేట్లు, ప్రోటీన్లు కొవ్వు, విటమిన్లు ఖనిజాలు, ఫైబర్, జింక్, ఐరన్ వంటి ఆహారాలను ఎక్కువగా ఇవ్వాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో 2వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు.

లాక్మే ఫ్యాషన్ వీక్‌లో అరంగేట్రం చేసిన మ్యాక్స్ ఫ్యాషన్

విశాలాంధ్ర-విశాఖపట్నం: ప్రముఖ ఫ్యాషన్ డెస్టినేషన్ గా పేరుగాంచిన లాక్మే ఫ్యాషన్ వీక్ ఎఫ్ డీసీఐ యొక్క 25వ ఎడిషన్‌లో మాక్స్ ఫ్యాషన్ అరంగేట్రం చేసింది. దీనికి ప్రముఖ నటి కేల్కి కేక్లా నాయకత్వం వహించారు. దేశంలోని అత్యంత ప్రతిష్టాత్మకమైన రన్ వే లలో ఒకటైన హై స్ట్రీట్ స్టైల్ ని మాక్స్ ఫ్యాషన్ సరికొత్తగా లిఖించిందని ఈ సందర్భంగా మ్యాచ్ మార్కెటింగ్ హెడ్ వల్లవి పాండే చెప్పారు. ప్రపంచ ఫ్యాషన్ అందరికీ అందుబాటులో ఉండే, ట్రెండ్-ఆధారిత సులభంగా ధరించగలిగే స్టైల్ ని మ్యాక్స్ ఫ్యాషన్ స్వీకరిస్తుందని ఈ రన్ వే ద్వారా చాటిచెప్పినట్లు అయ్యిందన్నారు. ఇక మ్యాక్స్ ఫ్యాషన్ కు చెందిన సిసిలియన్ సమ్మర్ అమాల్ఫీ ఎస్కేప్ కలెక్షన్ లను ప్రారంభించడంతో, మాక్స్ ఫ్యాషన్ హై స్ట్రీట్ ఫ్యాషన్‌ను సరికొత్తగా నిర్వచించినట్లు అయ్యిందన్నారు. తద్వారా అందరికి నచ్చే, అందరూ మెచ్చే ఫ్యాషన్ ను ఇప్పుడు లక్షలాది మందికి అందుబాటులో ఉండేలా చేసిందన్నారు.

కస్టమైజ్డ్ కూలింగ్'ను పరిచయం చేసిన సామ్‌సంగ్

విశాలాంధ్ర-విశాఖపట్నం: ప్రముఖ వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ అయిన సామ్‌సంగ్ , తమ తాజా ఆవిష్కరణ - 'కస్టమైజ్డ్ కూలింగ్'తో ఇంటి చల్లదనాన్ని పునర్నిర్వచిస్తోంది. ఈ తరహా మొట్టమొదటి ఫీచర్ , సామ్‌సంగ్ స్మార్ట్ ఎయిర్ కండిషనర్లను వర్క్స్ విత్ స్మార్ట్‌థింగ్స్ సర్టిఫైడ్ ఫ్యాన్లు స్విచ్‌లతో సమకాలీ కరిస్తుంది. మెరుగైన విద్యుత్ పొదుపుతో నిరంతరాయ సౌకర్యాన్ని అందిస్తుంది. విద్యుత్ డిమాండ్ ఏటా 6-7 శాతం పెరుగుతోంది, వేసవి నెలల్లో ఎయిర్ కండిషనర్ల వాడకం పెరగడం వల్ల ఇది మరింతగా పెరుగుతోందని ఆ సంస్థ ప్రతినిధి చెప్పారు. చాలా గృహాలు ఇప్పటికీ సౌకర్యం కోసం ఎయిర్ కండిషనర్లు, ఫ్యాన్లు రెండింటిపై ఆధారపడుతున్నాయన్నారు. సామ్‌సంగ్, 2025 బెస్పోక్‌ఏఐ శ్రేణి ఎయిర్ కండిషనర్లలో'కస్టమైజ్డ్ కూలింగ్' అనే స్మార్ట్ థింగ్స్-ఆధారిత పరిష్కారాన్ని పరిచయం చేసిందని చెప్పారు.

కాలిఫోర్నియా బాదంపప్పులతో ఆరోగ్యం

విశాలాంధ్ర-విశాఖపట్నం: సమతుల్య ఆహారం మొత్తం ఆరోగ్యంలో కీలక పాత్ర పోషిస్తుంది కాబట్టి పోషకాహారం అత్యంత ముఖ్యమైన అంశాలలో ఒకటి. బాదంపప్పు వంటి పోషకాలు అధికంగా ఉండే ఆహారాలను రోజువారీ భోజనంలో చేర్చడం అతి సులభమైనప్పటికి, ప్రభావవంతమైన మార్గం. భారతదేశంలో అత్యంత ప్రజాదరణ పొందిన బాదంపప్పు అయిన కాలిఫోర్నియా బాదంపప్పులు ప్రోటీన్, డైటరీ ఫైబర్, ఆరోగ్యకరమైన కొవ్వులు, మెగ్నీషియం, జింక్ మరియు విటమిన్ ఈ వంటి 15 ముఖ్యమైన పోషకాల సహజ వనరు, ఇవి ఆరోగ్యకరమైన జీవనశైలికి తెలివైన జోడింపుగా ఉంటాయి. తరతరాలుగా, మన తల్లులు , అమ్మమ్మలు బాదంపప్పు యొక్క ప్రాముఖ్యతను నొక్కిచెప్పారు . ఇప్పుడు, శాస్త్ర పరిజ్ఞానం వారి విజ్ఞానాన్ని సమర్థిస్తుంది. దాదాపు 200 కంటే ఎక్కువ ప్రచురించబడిన పరిశోధన అధ్యయనాలు, శక్తి మరియు రోగనిరోధక శక్తిని అందించడం నుండి మెరుగైన గుండె ఆరోగ్యం, రక్తంలో చక్కెర స్థాయిలు, బరువు నిర్వహణ వరకు బాదం యొక్క ఆరోగ్య ప్రయోజనాలను వెల్లడించాయి. బాదంపప్పులోని ఆరోగ్యకరమైన కొవ్వులు మరియు విటమిన్ ఈ మెరిసే చర్మానికి , వృద్ధాప్య వ్యతిరేక ప్రయోజనాలకు దోహదం చేస్తాయి.

భవిత కేంద్రంలో ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవం

విశాలాంధ్ర-అనందపురం : ఆనందపురం మండలం భవిత కేంద్రంలో ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నవిత విద్యా ఉపాధ్యాయులు కలమట శ్రీనివాస రావు పిల్లల్లో వయసుకు తగినట్టు మానసిక ఎదుగుదల లేక చేసిన పనిని పదేపదే చేయడం, మాట్లాడడంలో తడబాటు, సామాజిక పరస్పర చర్యల్లో ఇబ్బందులు పడటం, ఆలస్యం గా స్పందించడం వంటి లక్షణాలు గల వారిని ఆటిజం గా పేర్కొంటారు . ఇది ఒక నాడీ సంబంధిత రుగ్మత . ఆనందపురం గ్రామంలో మండల ప్రాథమిక పాఠశాల లో ఆటిజం పై ప్రజల్లో అవగాహన కల్పించడంతోపాటు ఆ వ్యాధితో బాధపడుతున్న వ్యక్తులను ఆదరించడం, తమలో ఒకరిగా భావించేలా చైతన్య పరచటం ఈరోజు యొక్క ముఖ్య ఉద్దేశం. పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు కె. అంజనా కుమారి, ఆటిజం పిల్లలకు తోటి విద్యార్థులు విద్యా మరియు సామాజిక అవసరములలో సహకరించాలని తెలియచేసారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సుబ్బలక్ష్మి ,కె జయ లక్ష్మి , నవిత విద్యా ఉపాధ్యాయురాలు ఐ. నాగమణి విద్యార్థులు పాల్గొన్నారు.